క్లుప్తంగా

మామిడి కాయలకు 'వడదెబ్బ'



వీపనగండ్ల: మండలంలోని చాలా గ్రామాల్లో అధిక ఉష్ణోగ్రతలతో మామిడి తోటల్లో కాయలు రంగు మారి నేలరాలుతుండడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. 40 డిగ్రీల నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో మామిడి కాయలు రాలిపోతుండడంతో ఆర్థికంగా నష్టపోతామని వాపోతున్నారు. స్థానికంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని మామిడి రైతులు కోరుతున్నారు.

పశువుల తొట్లను నీటితో నింపండి



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన పశువుల తొట్లకు నీటిని నింపకపోవడంతో రైతులు, గొర్రెల కాపరులు మూగ జీవాలకు నీరు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కల్వరాల, బొల్లారం, తూంకుంట తదితర గ్రామాల్లో కొన్ని తొట్లకు నీళ్లు నింపుతున్నా.. గ్రామంలో సరిపడా తొట్లు లేకపోవడంతో పశువులకు తాగునీటికి అవస్థలు పడుతున్నామని, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అవసరమైన గ్రామాల్లో అదనపు పశువుల తొట్లను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పశుగ్రాసం కొరతతో తిప్పలు



పాన్‌గల్: పశుగ్రాసం కొరత ఏర్పడటంతో వరి గడ్డికి డిమాండ్ బాగా పెరిగిపోయింది. ట్రాక్టర్ గడ్డికి రూ.15 నుంచి రూ.17 వేల వరకు వెచ్చించి ఇతర జిల్లాల నుంచి తెచ్చుకుంటున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో సాగు నీటి కొరతతో చాలా తక్కువ ఎకరాల్లో వరి సాగు చేశారు. దీంతో పాడి పశువులకు గడ్డి అవసరం ఉండటంతో తప్పని పరిస్థితులల్లో గడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పాడి రైతులు వాపోతున్నారు. నది పరివాహక జిల్లాల నుంచి ట్రాక్టర్లతో గడ్డిని మండల కేంద్రం రైతు తెచ్చుకుంటుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది

రాళ్లు తేలిన రోడ్డుపై ప్రయాణమేలా?



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ నుంచి కొత్తపేట గ్రామానికి వెళ్లే పీఆర్ రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. భీమా 27 ప్యాకేజీ కాల్వ నుంచి మాందాపూర్ గ్రామ సమీపం వరకు రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటనే భయంగా ఉందని కంకర రోడ్డుతో వాహనాలు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దాదాపుగా 200 మీటర్ల వరకు కంకర తేలిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కళాకారులకు ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో బ్రహ్మంగారి నాటక ప్రదర్శన సందర్భంగా కళాకారులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడి రూ.20 వేల ఆర్థికసాయం పంపించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం కళాకారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ ఉమ్మర్‌ఫారూఖ్, నరసింహేయదవ్, రాజుయాదవ్, శాంతయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మండుటెండల్లో 'పచ్చదనం'

- చెల్లపరమేశ్వరుడి చెంత ఆహ్లాదంగా..
- రమణీయంగా ఆకట్టుకుంటున్న వృక్షాలు
- దాతల సహకారంతో పదేళ్లక్రితం నాటిన మొక్కలు



పచ్చదనంతో తీగ జాతి మొక్కలు



ఆత్మకూరులో పచ్చదనంతో కళకళలాడుతున్న వృక్షాలు

ఆత్మకూర్: పరమేశ్వరస్వామి చెంత పచ్చదనం వెల్లివిరియడంతో ఆహ్లాదకరమైన వాతవరణం నెలకొంది. పదేళ్లక్రితం దాతల సహకారంతో రూ.3లక్షలు వెచ్చించి నాటిన రకరకాల పండ్లు, పూల మొక్కలు నేడు వృక్షాలుగా ఎదిగి రమణీయంగా, సువాసనలు వెదజల్లుతూ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలోని చెర్లపరమేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో మొక్కలను నాటాలని పరితపించిన భక్తబృందం వెంటనే కార్యాచరణ చేపట్టారు. పట్టణంలోని ప్రముఖ వ్యాపారులు బంగారు శ్రీనివాసులు, గాడి లక్ష్మీనారాయణ, బంగారు భాస్కర్, పిన్నంచర్ల ప్రకాష్, విఠల్‌రావు, కృష్ణయ్యాచారి, జిన్నారం శ్రీను తదితరులతో రూ.3లక్షలు నిధులు సేకరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మొక్కలను తెచ్చి నాటడంతో పాటు డ్రిప్పును ఏర్పాటు చేసి వాటిని సంరక్షించారు.

పండ్లు, పూలమొక్కల రకాలు

మామిడి, జామ, నేరేడు, దానిమ్మ, మేడిపండ్లు, సన్నజాజి మల్లెలు, బొడ్డు మల్లెలు, గులాబీ, మర్రి, టేకు, వేప, టెంకాయలు, జమ్మి, రాగి, చీమచింతచెట్టు, నల్లమద్ది, తెల్లమద్ది, మొదుగ, వెదురు బొంగులు, ఇతర మొక్కలను నాటారు. ప్రస్తుతం పూలను సేకరించి పట్టణంలోని ఆలయాలకు పూజల నిమిత్తం ఇవ్వడంతో పాటు బయట విక్రయిస్తున్నారు.

మొక్కలను సంరక్షించాలి

ఎంతో శ్రమ కోర్చి రూ.లక్షలు ఖర్చు చేసి నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగాయని, కానీ కొంతమంది మద్యం సేవించేందుకు, పొగ తాగేందుకు అడ్డా గా మార్చుకుని ఇక్కడి చెట్లకు నష్టం చేకూరుస్తున్నారని, దీన్ని నివారించేందుకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. గోడ దూకి లోపలికి ప్రవేశించి పండ్ల చెట్లకు, పూలమొక్కలకు నష్టం చేకూరుస్తున్నారని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతినిత్యం పూలతో పూజలు



శ్రీచెర్ల పరమేశ్వర స్వామివారికి ఇక్కడి పూలతో ప్రతినిత్యం పూజలు నిర్వహిస్తున్నాం. పట్టణంలోని మిగతా ఆలయాలకు కూడా ఓ పూలవ్యాపారి ద్వారా పూజలకు పూలను పంపిస్తున్నాం. ప్రస్తుతం అన్ని రకాల వృక్షాలతో గుడి పరిసరాలు పచ్చదనంతో కలకలలాడుతున్నాయి.

– కర్నసయ్య, ఆలయపూజారి, ఆత్మకూర్

అందరిపై బాధ్యత ఉంది



చెరువు మధ్యలో వెలసిన పరమేశ్వరస్వామి ఆలయం ఎంతో చారిత్రకతను సంతరించుకుంది. అందరి కృషి ఫలితంగా పదేళ్ల క్రితం చందాల రూపంలో డబ్బులను సేకరించి అన్ని రకాల మొక్కలను నాటించాం. ప్రస్తుతం అవి వృక్షాలుగా ఎదిగి ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– బంగారు శ్రీనివాసులు, ఎంపీపీ, ఆత్మకూర్

ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం

ఆత్మకూర్ మున్సిపాలిటీలో ఇది వరకే పార్కులను ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షిస్తున్నాం. ప్రస్తుతం మొక్కలు వృక్షాలుగా ఎదిగి పట్టణమంతా ఆహ్లాదకరమైన వాతవరణం సంతరించుకుంది. చెర్లపరమేవ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతివనాన్ని సంరక్షిందేకు దృష్టిసారిస్తున్నాం. సిబ్బందిని కేటాయిస్తాం, తాగుబోతులు రాకుండా పోలీస్‌శాఖ వారితో మాట్లాడుతాం.

– గాయత్రిరవికుమార్, పుర చైర్‌పర్సన్

కార్మిక పాలసీని ప్రకటించాలి

పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు కోరారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని హమాలీ, తోపుడుబండ్లు, బజార్ హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలనలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ వినతిపత్రాన్ని కరపత్రంగా ప్రింట్ వేయించి దాని పత్రులను కార్మికుల సమక్షంలో విడుదల చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాగా కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేయబోమని, చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని, 2023 అసెంబ్లీ ఎన్నికల సభల్లోనూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రచురించినట్లు రేవంత్‌రెడ్డికి గుర్తుచేశామన్నారు. కార్యక్రమంలో నందిమల్ల రాములు, గోవిందు, శివ, రాములు, శాంతయ్య, సాయిలు, యాదగిరి, కురుమూర్తి, రాములు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి



చనిపోయిన గొర్రె పిల్లల వద్ద రోధిస్తున్న గొర్రెల కాపారి కుటుంబం

పాన్‌గల్: కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృత్యువాత పడిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధిత గొర్రెల కాపారి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన అన్నె కృష్ణయ్య తన ఇంటి సమీపంలో గొర్రె పిల్లలు, మేక పిల్లలను వలల్లో ఉంచి గొర్రెలను మేతకు అడవికి తీసుకెళ్లాడు. అనంతరం వలల్లో ఉన్న దాదాపుగా 20 వరకు గొర్రె, మేక పిల్లలను కుక్కలు దాడి చేసి చంపివేశాయని గొర్రెల కాపారి పేర్కొన్నారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రె పిల్లల నష్టం దాదాపుగా రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ పరంగా సహాయం చేసి ఆదుకోవాలని గొర్రెల కాపారి కోరుతున్నాడు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో చిత్తు

- జేబులు గుల్ల చేసుకుంటున్న యువత
- పోలీసులు అవగాహన కల్పించాలంటున్న ప్రజలు

పాన్‌గల్: ఆన్‌లైన్ బెట్టింగులు పట్టణం నుంచి పల్లెకు చేరాయి. గ్రామీణ ప్రాంతాల్లో యువత ఆ మోజులో పడి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. రూ.లక్షల్లో సొమ్ము పోగొట్టుకుంటున్నారు. క్రికెట్ మొదలు కొని జూదం లాంటి ఆటలకు సైతం బెట్టింగు సంస్కృతి పాకింది. శ్రమించకుండా అధిక మొత్తంలో డబ్బు వస్తుందన్న ఆశతో యువత సులభంగా ఆకర్షితులవుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేస్తూ వాటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్ వేదికగా పదుల సంఖ్యలో కొత్త యాప్‌లు పట్టుకొస్తున్నాయి. సెల్‌ఫోన్‌లో యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని బెట్టింగులకు పాల్పడుతున్నారు. జూదం స్థావరాలపై పోలీసుల దాడులు పెరగడంతో యువత ఈ ఆన్‌లైన్ బాట పడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని యువత ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు పెట్టి తీవ్రంగా నష్టపోయిన ఘటనలు మండలంలో చాలా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువత తల్లిదండ్రులకు తెలియకుండా బెట్టింగులకు పాల్పడి అప్పుల ఊబిలో పడుతున్నారు. వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో జోరుగా ఐపీఎల్ బెట్టింగ్

ఐపీఎల్ మొదలవడంతో ఆన్‌లైన్‌లోనూ కొంత మంది యువకులు ఓ సమూహంగా మారి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. టాస్‌పై బంతి బంతికి, ఓవర్‌కు ఓసారి, బ్యాట్స్‌మెన్, బౌలర్‌లను బట్టి సైతం బెట్టింగులకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో పలు ప్రత్యేక సమాచార యాప్‌ల సహాయంతో ఏ జట్టు గెలుపొందుతుంది అంటూ ముందే సమాచారాన్ని చేరవేస్తారు. సదరు సమాచారాన్ని బట్టి యువత ఆ జట్టుపై బెట్టింగులు కాస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలల్లో యువత గుంపులుగా, గుంపులుగా చేరి ఈ బెట్టింగుల్లో పాల్గొంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు ఆయా గ్రామాల్లో యువతకు అవగాహన కల్పిస్తూ ఇలాంటి బెట్టింగులకు పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని యువత తల్లిదండ్రులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం



ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై, ప్రోత్సహిస్తున్న వారిపై సైతం క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో యువతకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. యువత చెడు వ్యసనాల జోలికి పోకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలి.

– వేణు, ఎస్ఐ, పాన్‌గల్

గుండ్ల చెరువు తూములో రాయి తొలగింపు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గుండ్ల చెరువు తూములో అడ్డుగా ఉన్న రాయిని ఆదివారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. తూములో రాయి అడ్డుపడి నీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీపీఐ జిల్లా నాయకులు కళావతమ్మ, శ్రీరామ్ ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ సుభాష్‌నాయుడు దృష్టికి తీసుకవెళ్లారు. దీంతో వారు స్పందించి జేసీబీ సహాయంతో తూములో అడ్డుగా ఉన్న రాయిని తొలగించి నీరు సాఫీగా వెళ్లే విధంగా చేశారు. దీనిపై సీపీఐ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. చివరి ఆయకట్టుకు నీరు అందుతుందని రైతులు తెలిపారు.

రేపటి నుంచి పీపీఎల్4 క్రికెట్ పోటీలు

కొత్తకోట రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో మంగళవారం నుంచి పీపీఎల్ 4 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు యాదగిరిగౌడ్, బీరయ్య, ఆసీఫ్ తెలిపారు. దాతల సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.10వేల నగదుతో పాటు షీల్డ్, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.5వేల నగదుతో పాటు షీల్డ్ అందజేస్తామని వారు తెలిపారు. క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలని కోరారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురంలో ప్రీమియర్ లీగ్–9 క్రికెట్ పోటీలను పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీలను స్నేహపూర్వకంగా ఆడాలని, గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మార్కెట్ మాజీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, విండో చైర్మన్ గౌని కోదండరామిరెడ్డి, విజయ్‌గౌడ్, ఉపేందర్‌గౌడ్, మేకల ఎల్లస్వామి, రాధకృష్ణ, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు

ఆత్మకూర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే సత్ఫలితాలు సాధించి లక్ష్యాన్ని చేరుకుంటారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంవీరామన్ హైస్కూల్ సీబీఎస్ఈ పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మణ్ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సాస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సిశ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.



కోటిలింగేశ్వర ఆలయంలో లక్ష పుష్పార్చణ



పామిరెడ్డిపల్లిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా లక్షపుష్పార్చన నిర్వహించారు. లోక కల్యాణార్థం ఎండల తీవ్రత తగ్గి సమస్త జీవరాసులు చల్లగా ఉండాలని కోరుతూ లక్షపుష్పాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న లక్షపుష్పార్చన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

పామిరెడ్డిపల్లిలో..

మాస శివరాత్రిని పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో వైరాలగుట్టలో వెలసిన శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు చేసిన భజనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామానికి చెందిన చిట్యాల చెన్నారెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి మాస శివరాత్రి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం ఉంటుందని భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



కానాయపల్లి ఆలయంలో..

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాటతండాకు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ రాంలాల్‌నాయక్ తండ్రి నీల్యానాయక్ (80) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి వడ్డెవాటతండాకు చేరుకొని నీల్యానాయక్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంలాల్‌నాయక్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్, కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, జేసీబీ రాములుసాగర్, తరుణ్‌నాయక్, నరేందర్‌సాగర్, రాములుయాదవ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట పట్టణ కేంద్రంలోని 11వ వార్డుకు చెందిన జిట్‌పోల్ బోగం బాలరాజు (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జేఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్ మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జేఎం మిషేక్, నిక్సన్, శ్యామ్‌కుమార్, కర్ణకుమార్, కుమార్, ఏసు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సింగిల్‌విండో క్లర్క్ మృతి

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరుకు చెందిన వెంకటస్వామి సింగిల్‌విండో కార్యాలయంలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున అస్వస్థతకు గురికావడంతో గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. వెంకటస్వామి అకాల మరణం చెందడం బాధాకరమని జెడ్పీటీసీ వెంకట్రామణమ్మ తెలిపారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీజేపీ మద్దతుతోనే కలెక్టర్‌కు ఫిర్యాదు



మాట్లాడుతున్న అబ్రహం

అమరచింత: మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆమెను గద్దెదించి వైస్ చైర్మన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోవాలనే లక్ష్యంతో సీపీఎం బీజేపీ కౌన్సిలర్‌తో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. సీపీఐ కౌన్సిలర్, జిల్లా కార్యదర్శి విజయరాములు చైర్మన్‌గా ఉండాలనే బీజేపీ కౌన్సిలర్‌తో కలిసి కుట్రపన్నాడని సీపీఎం ఆరోపించడం తగదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న జీఎస్ గోపి తీర్థయాత్ర పేరుతో తిరుపతి వెళ్లారని, అక్కడే బీజేపీ కౌన్సిలర్‌తో జతకట్టి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించిన విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. సీపీఎం కౌన్సిలర్ మున్సిపల్ చైర్మన్‌గా, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ వైస్ చైర్మన్‌గా ఉండాలని నిర్ణయించుకున్నారని వెల్లడించారు. ప్రస్తుతం అవినీతిపై పోరాటం చేయాలన్న ఉద్దేశ్యంతో ఐదుగురు కౌన్సిలర్లు పోరాడుతున్నారని, వీటిని జీర్ణించుకోలేక సీపీఐపై విష ఆరోపణలు చేయడం తగదన్నారు. మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో సీపీఐ పట్టణ అధ్యక్షుడు భాస్కర్, కుతుబ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

మదనాపురం: మండలంలోని గోవిందహళ్లి గ్రామానికి చెందిన కృష్ణయ్యయాదవ్ బీజేపీలో చేరారు. గతంలో బీజేపీ మండల అధ్యక్షుడిగా పనిచేస్తూ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న ఆయన ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, దేవరకద్ర నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జ్ ఎగ్గని నరసింహులు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎగ్గని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాజేందర్‌రెడ్డి, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మక్తల్ అసెంబ్లీ కోకన్వీనర్ రేజింతల శ్రీనివాస్‌యాదవ్, కొత్తకోట మండల అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి, మండల యువమోర్చా అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్, వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ బంగారు రవి, మల్లేష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి



మదనాపురం: బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొన్నూరులో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరు అధైర్యపడొద్దన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, జయంతమ్మ, మాజీ సర్పంచ్ శ్రావణి తదితరులు ఉన్నారు.

ప్రతి ముస్లిం నిరుపేదలకు అండగా ఉండాలి



ఆత్మకూర్‌లో ప్రసంగిస్తున్న ఫహీమ్ నద్వీ



దుప్పల్లిలో..



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: ప్రతి ఒక్క ముస్లిం నిరుపేదలకు అండగా ఉండాలని, సంపాదనలో కొంతభాగం తప్పనిసరిగా పేదలకు (జకాత్) ఇవ్వాలని ముఫ్తి సయ్యద్ ఫహీమ్ నద్వీ, మౌలానా అబ్దుల్‌అలీం రషాదీ, మౌలాన జియా ఉర్ రహ్మాన్, మౌలానా ముక్తదీర్, సయ్యద్ మగ్దూంఅలీ అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలోని అత్యంత ప్రాముఖ్యమైన శబేఖద్ర్ పర్వదినం సందర్భంగా స్థానిక మస్జిదే ఆజంజాహి, మస్జిదేసయ్యదియా, ఈద్గామస్జీద్‌లతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ప్రతి ముస్లిం దివ్యఖురాన్‌ను పఠించాలని, దివ్యఖురాన్ సర్వమానవళికి మార్గదర్శమని, ఐదు పూటల నమాజు ఆచరించాలన్నారు. మహ్మద్ రసూలిల్లాహ్ సల్లాల్లాహు వలైవసల్లంవారిపై అల్లాహ్ ఆదేశాలను ప్రకటించినట్లు గుర్తుచేశారు.

ఆ నలుగురు క్షమార్హులు కారు

రంజాన్‌మాసంలో శబేఖద్ర్ వెయ్యి నెలలతో సమానమని, ఈ ఒక్కరోజు జాగారం చేసి ప్రార్థనలు(ఇబాదత్) చేస్తే వెయ్యి నెలల పాటు పుణ్యం దక్కుతుందని, ప్రతి ఒక్కరికీ మోక్షం లభిస్తుందని మౌలానాలు అన్నారు. తల్లిదండ్రుల పాదాల చెంత స్వర్గం ఉందని, వారిని ఇబ్బంది పెట్టేవారిని అల్లాహ్ క్షమించరని, వడ్డీల వ్యాపారం చేసేవారు, జూదం ఆడేవారు, మద్యం సేవించేవారు, విగ్రహారాధన చేస్తూ మనుష్యులను పూజించేవారు, కుట్రలు, కుతంత్రాలు చేపడుతూ ఇతరుల గురించి చెడు ప్రచారం చేసే వారు క్షమార్హులు అని అన్నారు. ఈ సందర్భంగా దివ్యఖురాన్ సూక్తులు, మొహ్మద్ ప్రవక్తవారి ఉపదేశాలను ప్రసంగించారు. అనంతరం నెలరోజుల పాటు దివ్య ఖురాన్‌ను పఠించి తరావిహ్ నమాజులో వినిపించిన హాఫీజ్ సాబ్‌లను మస్‌జిద్ కమిటీ నిర్వాహకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ముస్లింలకు ఇఫ్తార్

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు ఆదివారం రాత్రి మండలంలోని పిన్నంచర్లలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దివంగత రామస్వామిగౌడ్ కుటుంబసభ్యులు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానాలు ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హాఫిజ్ సాబ్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ విజయలక్ష్మి, నిర్వాహకులు మచ్చేందర్‌గౌడ్, న్యాయవాది అశోక్‌కుమార్‌గౌడ్, హరీష్‌గౌడ్, ఖాజన్న, అష్రఫ్, యూసూఫ్, అయ్యూబ్, వాహేద్, అల్తాఫ్, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు.

తోఫాలు పంపిణీ

నిరుపేద ముస్లింలకు పదో వార్డు కౌన్సిలర్ తబస్సూంమోసీన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది 20 కుటుంబాలకు రూ.20 వేలు విలువ చేసే రంజాన్ తోఫాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమీర్, తౌఫిఖ్, అబ్రార్, ఆరీబ్, ఆవేజ్, తఖీ తదితరులు ఉన్నారు.

అమరచింత: పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు వంశీచందర్‌రెడ్డి, డీకే అరుణ హాజరయ్యారు. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేపట్టిన వారికి ఇఫ్తార్ విందును డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్నారు

వస్త్రాలు..

మదనాపురం: మండలంలోని దుప్పల్లి నూరే మస్‌జిద్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం ముస్లింలకు వస్త్రాలు పంపిణీ చేశారు. పేద ముస్లింలకు ప్రతి ఏటా మాదిరిగా ఈసారి వస్త్రాలు పంపిణీ చేశామని నిర్వాహకులు ఖాజామైనొద్దిన్, నజీర్ తెలిపారు. కార్యక్రమంలో సుల్తాన్ సయ్యద్ పాషా, ఖాసీం పాల్గొన్నారు.